సంగారెడ్డి

నమస్తే తెలంగాణ

శనివారం 16 మార్చి 2024

SATURDAY, MARCH 16, 2024

సంగమేశ్వరాలయంలో హుండీ లెక్కింపు

ఝరాసంగం, మార్చి 15: మండల కేంద్రంలోని దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. మహాశివరాత్రి, బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు స్వామి వారి హుండీలో కానుకల రూపంలో వేసిన నగదు రూ. 14,56, 956లక్షలు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి శశిధర్ తెలిపారు. కామారెడ్డి పట్టణానికి చెందిన రాజరాజేశ్వర సేవాసమితికి చెందిన భక్తులు, ఆలయ సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

కేతకీని దర్శించుకున్న కేంద్రమంత్రి

కేతకీ ఆలయాన్ని శుక్రవారం కేంద్ర రసాయన ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవత్ కూబా కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అమృతగుండంలోని జలలింగానికి పూజలు నిర్వహించి, గర్భాలయంలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకుని రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. ఆలయ అధికారులు మంత్రిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని సన్మానిస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

ఐఐటీహెచ్‌ను సందర్శించిన జపాన్ పారిశ్రామిక బృందం

సంగారెడ్డి మార్చి 15(నమస్తే తెలంగాణ): కందిలోని ఐఐటీ హైదరాబాద్‌ను జపాన్ పారిశ్రామికవేత్తల బృందం శుక్రవారం సందర్శించింది. జపాన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి కెంటాటాని నేతృత్వంలో 26మంది పారిశ్రామికవేత్తల బృందం ఐఐటీ హైదరాబాద్‌ను సందర్శించారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తితోపాటు డిపార్టుమెంట్ల వారీగా డీన్‌లను కలిశారు. అనంతరం సుజుకి ఇన్నోవేషన్ సెంటర్‌ను, జైకా ఫ్రెండ్‌షిప్ సెంటర్‌ను, టీహాన్‌ను సందర్శించారు. డైరెక్టర్ బీఎస్ మూర్తి, అంతర్జాతీయ సంబంధాల విభాగం ప్రొఫెసర్ తరుణ కాంతిపాండా, జైకా టీమ్ లీడర్ కునితోషి సైటో, ప్రొఫెసర్ కొటారో కటోకా, కేరీర్ సర్వీసెస్ ఆఫీస్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డా.అభినవ్‌కుమార్ తదితరులతో జపాన్ పారిశ్రామికవేత్తలు సమావేశమయ్యారు. ఐఐటీలో కోర్సులు, పరిశోధనలు, జపాన్ విద్యా, పారిశ్రామిక సంబంధాలపై జపాన్ పారిశ్రామికవేత్తల బృందం చర్చించింది. ఆ తర్వాత ఐఐటీహెచ్ విద్యార్థులతో సమావేశమై జపాన్‌లోని పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు, ఇంటర్న్‌షిప్‌ల గురించి తెలియజేశారు. పారిశ్రామికవేత్తల బృందం ప్రతినిధి కెంటాటాని మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్‌ను సందర్శించటం ఆనందంగా ఉందన్నారు. జ పాన్ సాంకేతికత, ఆవిష్కరణలను భారత్‌తో అనుసంధానించటం ద్వారా వ్యాపార సంబంధాలను విస్తృత పర్చాలనుకుంటున్నట్లు తెలిపారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 15: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జిల్లా వినియోగదారుల కమిషన్, న్యాయ సేవాసదన్లను విద్యార్థినులు సందర్శించారు. జిల్లా వినియోగదారుల ఫోరం న్యాయమూర్తి, సీనియర్ జడ్జిలతో విద్యార్థులు ముఖాముఖి అయ్యారు. వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకున్నారు.

సీనియర్ సివిల్ జడ్జి హనుమంతరావు, వినియోగదారుల కమిషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అమ్మకందారుల మోసాల నుంచి కోర్టును ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. వినియోగదారులను అడుగడుగున మోసం చేస్తారని, ఆయా మోసాలను ఎదిరించాలంటే వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు మల్లిక, నవ్యా, సచిత్ర విద్యార్థినులు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

మాదారంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

జిన్నారం, మార్చి 15: మాదారం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన పలు నిర్మాణాలను పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 270, 271, 273, 283, 284, 620, 627, 729 ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలను జేసీబీలతో రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఒకరిద్దరు మినహా ఇండ్లన్నీ నిరుపేదలు కట్టుకున్నవే, ఇండ్లు కూల్చొద్దని మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ భిక్షపతి, అధికారులను కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామని, తమ విధులకు ఆటంకం కలిగించొద్దని అధికారులు సూచించారు. ఇవన్నీ కూడా బీఆర్ఎస్‌కు చెందిన వారివేనని, కాంగ్రెస్ వారు చేపట్టిన నిర్మాణాలను ఒక్కటి, రెండు కూల్చి అధికారులు చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు అన్నారు. రాజకీయ అభివృద్ధిని ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్ కక్ష సాధింపు చర్యలకు దిగారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ ఆరోపించారు. పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధి కోసం అందరం పని చేస్తున్నామని, అలాంటిది కేవలం ఒక పార్టీకి సంబంధించిన వారి ఇండ్లను అధికారులతో కూల్చివేయించి, కాంగ్రెస్‌కు చెంది న వారి ఇండ్లను ముట్టుకోకపోవడం విడ్డూరమన్నారు.

అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి

వట్‌పల్లి, మార్చి 15 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం పోతులబోగుడలో మాజీఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌తో కలిసి అందోల్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. మళ్లీ కాంగ్రెస్‌కు ఓటువేసి మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతుబంధు, రైతు బీమా, రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మొండిచేయి చూపించిందన్నారు. ఆరు గ్యారెంటీలు ఆరు మోసాలుగా ప్రజలు గుర్తించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంటు, నీటి కష్టాలు మొదలయ్యాని గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో ప్రజలకు, రైతులకు మళ్లీ కష్టాలను పరిచయం చేసింది కాంగ్రెస్ పార్టీనేనని ధ్వజమెత్తారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు బీఆర్ఎస్ పార్టీ తరపున తనను ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి శివాజీరావు, మండల నాయకుడు అశోక్‌గౌడ్, వీరారెడ్డి, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పోతులబోగుడలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

మంత్రి ఆదేశాలతోనే అక్రమ కేసులు

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రతిపక్షాలను ఏనాడూ వేధించలేదు..

- కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఎమ్మెల్యే కుటుంబంపై ఒత్తిడి
- కాంగ్రెస్ పార్టీ నేతల క్వారీలపై కేసులేవి..?
- కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్
- పటాన్‌చెరులో మాజీ మంత్రి హరీశ్‌రావు
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తమ్ముడి అరెస్టును తీవ్రంగా ఖండించిన హరీశ్‌రావు
- ఎమ్మెల్యే కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

పటాన్‌చెరు, మార్చి 15: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డిని పోలీసులు తెల్లవారుజామున అరెస్టు చేయడంపై హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. అర్ధరాత్రి అరెస్టు చేయాలని భారీ బలగాలతో వచ్చి తెల్లవారుజామున పోలీసులు గూడెం మధుసూదన్‌రెడ్డిని అరెస్టు చేయడం తప్పన్నారు. తమ పార్టీలో చేరాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే బంధువులపై కాంగ్రెస్ సర్కారు అక్రమ కేసులు పెడుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన గాలికి వదిలేసి, ప్రతిపక్షాలను వేధించడంలో నిమగ్నమైందని విమర్శించారు. వందలాది పోలీసులు వచ్చి మూడు గంటల రాత్రి సమయంలో అరెస్టు చేయడంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఏమైనా బంధిపోటా అని ప్రశ్నించారు.

మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతోనే క్రషర్లపై విచారణ నిర్వహిస్తున్నామని స్వయంగా ఆర్డీవో తెలిపిన వీడియోను మంత్రి ఫోన్‌లో చూపించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడు కక్షసాధింపు చర్యలకు పాల్పడింది లేదన్నారు. క్రషర్ల వ్యాపారులను ఏనాడు వేధించింది లేదన్నారు. కాంగ్రెస్ నాయకులకు క్రషర్లు ఉన్నా ఏమనలేదన్నారు. ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. బెయిల్ వచ్చే సెక్షన్లతో కేసులు ఉన్నా, ఏదో రకంగా జైలుకు పంపాలని చూస్తున్నారన్నారు. బెదిరించి లొంగదీసుకుని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలనే ఉద్దేశం వారిదన్నారు. ప్రజాసేవ చేయడానికి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వారి ప్రభావం పడదన్నారు. గ్రామాల్లో తాగునీరు రావడం లేదని, పంటలు ఎండుతున్నాయని, వీటి గురించి పట్టించుకోకుండా వేధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ప్రతిపక్షాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారనన్నారు. గూడెం మధుసూదన్‌రెడ్డికి పార్టీ అండగా ఉంటుందని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు.

హరీశ్‌రావు పరామర్శ...

గూడెం మధుసూదన్‌రెడ్డిని తన నివాసం నుంచి తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు హుటాహుటిన పటాన్‌చెరుకు వచ్చారు. గూడెం మధు నివాసానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. రాజకీయాల్లో ఇలాంటివి ఉంటాయని, అధైర్య పడవద్దన్నారు. రాజకీయ కుట్రలు ఎదుర్కోవడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటే అన్నారు. పోలీసులు నిబంధనల మేరకు వ్యవహరించలేదని, వారిపై న్యాయపరమైన పోరాటం జరుపుతామని వెల్లడించారు. హరీశ్‌రావు వెంట ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సఫాన దేవ్, శంకర్‌యాదవ్, నర్రా భిక్షపతి, ఈర్ల దేవానంద్, దశరథరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి తన తమ్ముడు మధుసూదన్‌రెడ్డి రాముడికి లక్ష్మణుడిలా ఎప్పుడూ వెన్నంటి ఉండేవారు. సోదరుడిని పోలీసులు అరెస్టు చేయడంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తట్టుకోలేక భావోద్వేగానికి గురయ్యారు. గద్గద భరితమైన స్వరంతో తమ్ముడి అరెస్టును ఖండించారు. తాను పదేండ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేసినా, ఏనాడు ఎవరినీ బాధించలేదన్నారు. తన తమ్ముడిని ఎలాగైనా అరెస్టు చేసి జైలుకు పంపాలనే కక్షతో కాంగ్రెస్ నాయకులు పోలీసులను ఎగేశారన్నారు. ఎంపీటీసీగా, ఎంపీపీగా, ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచానంటే తన మంచితనంతోనే అన్నారు. కక్షపూరితంగా తాను వ్యవహరించి ఉంటే తనను రెండోసారే ప్రజలు పక్కకు పెట్టేవారన్నారు. గూడెం మధుసూదన్‌రెడ్డిపై రాజకీయ కుట్ర పన్నారని, కుట్రలను తట్టుకొని రాజకీయ, న్యాయపోరాటం చేస్తామన్నారు. క్రషర్‌ను పూర్తి పర్మిషన్లతోనే నడిపిస్తున్నామని, బెదిరింపులకు భయపడేది లేదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. దీనిని ప్రజాకోర్టులో తేల్చుకుంటామన్నారు.

దవాఖాన ఎదుట హైడ్రామా

సంగారెడ్డి, మార్చి15: అక్రమ మైనింగ్ వ్యవహారంలో అరెస్ట్ అయిన గూడెం మధుసూదన్‌రెడ్డిని పోలీసులు ప్రత్యేక వాహనంలో వైద్యపరీక్షల కోసం జిల్లా దవాఖానకు తరలించారు. సంగారెడ్డికి తీసుకొచ్చిన విషయం తెలుసుకున్న అభిమానులు తమ నాయకున్ని చూస్తామని దవాఖానలోపలికి వెళ్లే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంత సమయం పాటు ప్రభుత్వ దవాఖాన ఎదుట హైడ్రామా చోటు చేసుకున్నది. తమ నాయకున్ని చూపించాలని పటాన్‌చెరు నుంచి తరలివచ్చిన అభిమానులు ఏఎస్పీ సంజీవరావ్, సంగారెడ్డి డీఎస్పీలతో వాగ్వాదానికి దిగా రు. ఓపీ సమయంలో ఎక్కడ నుంచో వైద్య సేవల నిమిత్తం దవాఖానకు వచ్చే రోగులకు పోలీసుల వ్యవహారం, అత్యుత్సాహంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అకోలా-నాందేడ్ ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ జామ్‌తో రోడ్డంతా రద్దీగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మధుసూదన్‌రెడ్డిపై 379,409, 420, 427,447 సెక్షన్లతో పాటు మైనింగ్ మినరల్స్ యాక్టులు 21,23, R/W 4(1)4 (1)(2) సెక్షన్లతో కేసులు నమోదు చేశారు. అనంతరం వైద్య పరీక్షలు పూర్తి అయిన తర్వాత జిల్లా కోర్టుకు తీసుకొచ్చి మొబైల్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. ఇరువర్గాల వాదప్రతివాదనలు విన్న న్యాయమూర్తి 14రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.

మధుసూదన్‌రెడ్డిని సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చిన పోలీసులు

మానవత్వం చాటిన ఎమ్మెల్యే

హత్నూర, మార్చి15: సిరిపుర శివారులోని ప్రధానరోడ్డుపై గాయాలతో ఉన్న ఇద్దరిని గమనించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారిని దవాఖానకు తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పలువురు బాధిత కుటుంబీకులను పరామర్శించిన అనంతరం చిలప్‌చెడ్ మండలానికి వెళ్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సిరిపుర శివారులో ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఆటోను ఢీకొట్టి గాయపడిన వ్యక్తులను చికిత్స కోసం దవాఖానకు తరలించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

కోహీర్, మార్చి15: బడంపేట రాచన్న స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం వేడుకలను పురస్కరించుకొని ఆలయంలోని శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రావతారంలో కొలువుదీరిన రాచన్నస్వామికి అభిషేకం, బిల్వార్చన, భద్రకాళీదేవికి కుంకుమార్చన, మహామంగళహారతి చేపట్టారు. అనంతరం ఆలయావరణలోని కోనేరులో స్నానమాచరించి అగ్నిగుండానికి పూజలు నిర్వహించారు. హరహర మహదేవ్..అంటూ నిప్పులో నుంచి నడిచి భక్తిని ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన చిల్కేపల్లి కృష్ణమూర్తి కుటుంబం, కంకోల్ స్వామి కుటుంబం, జహీరాబాద్ కౌలాస్ పరివార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో మాజీమంత్రి చంద్రశేఖర్, మాజీఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, శివానంద్, జగదీశ్వర్‌స్వామి, దయానంద్ పాటిల్, నాగేశ్ పాల్గొన్నారు.

పటాన్‌చెరులో తీవ్ర ఉద్రిక్తత

- ఎమ్మెల్యే సోదరుడు అరెస్టు
- ఆందోళన మధ్య సంగారెడ్డి కోర్టుకు గూడెం మధు తరలింపు
- భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 15: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు.శుక్రవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్‌లోని మధుసూదన్‌రెడ్డి నివాసాన్ని పోలీసు బలగాలు దిగ్బంధించి ఆయన్ను అరెస్టు చేశారు. భారీ సంఖ్యలో మోహరించిన పోలీసుల మధ్య ఆయనను పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లక్డారంలో ఎమ్మెల్యే కుటుం బ సభ్యుల నిర్వహణలోని క్రషర్లలో కేటాయింపులు జరిగిన దానికంటే అధికంగా క్రషింగ్ జరిగిందని ఆరోపిస్తూ కేసు నమోదు చేశారు. గూడెం మధుసూదన్‌రెడ్డిని పోలీసులు సంగారెడ్డి కోర్టుకు తరలించేందుకు తీసుకెళ్తుండగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున వచ్చి అడ్డుకోవడానికి యత్నించారు. భారీ సంఖ్యలో వచ్చిన పోలీసులు గూడెం మధుసూదన్‌రెడ్డిని సంగారెడ్డికి తరలించారు. సంగారెడ్డిలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో ప్రవేశపెట్టారు. గూడెం మధుసూదన్‌రెడ్డి అరెస్ట్‌పై పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో పాటు ఆయన అభిమానులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పీస్ కమిటీ సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, మార్చి 15: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పోలీస్ కల్యాణ మండపంలో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉగాది, రం జాన్, గుడ్ ఫ్రైడే, హోలీ పండుగలు ఏకకాలంలో వస్తున్న సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా వివిధ మతాలకు చెందిన మతపెద్దలతో పీస్ కమిటీ ఏర్పాటు చేశారు. కులమతాలు వేరైనా మొదటిగా మనమందరం భారతీయులమన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. వివిధ మతాలకు చెందిన పండుగలు ఏకకాలంలో వస్తున్నాయని, ఒకరి మత సంప్రదాయాల ను మరొకరు గౌరవించినప్పుడు మత సామరస్యం నెలకొంటుందన్నారు. ఎలాంటి గొడవలకు తావులేకుండా కులమతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలన్నారు. ప్రజల శ్రేయస్సు కు పోలీసుశాఖ అహర్నిశలు కృషి చేస్తుందని, జిల్లా పోలీసు శాఖకు సహకారం అవసరమని, అందుకు సబ్‌డివిజన్ల వారీగా పీస్ కమిటీ, మైత్రి సంఘాలను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర, ఆపద సమయంలో డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, వర్టికల్ డీఎస్పీ రాణా వీరారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, జిల్లా ఇన్‌స్పెక్టర్స్, సబ్-ఇన్‌స్పెక్టర్స్, జిల్లా నుంచి వచ్చిన మతపెద్దలు, రాజకీయ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

కల్యాణం..కమనీయం

- కనులపండువగా లక్ష్మీ అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

రామచంద్రాపురం, మార్చి 15: లక్ష్మీ అనంత పద్మనాభస్వామి కల్యాణాన్ని గురువారం రాత్రి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలో కనులపండువగా నిర్వహించారు.16వ వార్డు కౌన్సిలర్ సుచరితాకొమురయ్య దంపతులు, 17వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల రవీందర్‌రెడ్డి దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. వెలిమెల గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులందరికీ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహోత్సవాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కాట శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేటర్లు పుష్పానగేశ్, మెట్టుకుమార్, వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్లు తదితర ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



లక్ష్మీ అనంతపద్మనాభస్వామి కల్యాణాన్ని జరుపుతున్న వేదపండితులు, చిత్రంలో కౌన్సిలర్లు సుచరితాకొమురయ్య

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 15: జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, మండల విద్యాధికారులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, మండల, పట్టణ సమైఖ్యలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళాసంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలలో ముఖ్యపాత్ర స్వయం సహాయక బృందాలదేనని పేర్కొన్నారు. తల్లులే కమిటీ సభ్యులుగా ఉంటారని, ప్రతి పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ప్రతి పాఠశాలను మానిటరింగ్ చేయడం, వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలో పునఃప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు అందించడమే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ముఖ్యమైన అంశాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కమిటీలు రూ.25 వేల వరకు అత్యవసర నిధులు వినియోగించవచ్చని కలెక్టర్ సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వహణ కమిటీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని సూచించారు. పాఠశాలలో చేపట్టిన పనులకు రూ.లక్ష వరకు ఎంపీడీవో, రూ.లక్షకు పైగా పనులకు కలెక్టర్ చెల్లింపులు చేస్తారని వివరించారు. మన ఊరు మన బడి ద్వారాఇంకా పూర్తికాని పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలని కలెక్టర్ తెలిపారు. సదస్సులో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీఆర్డీవో జ్యోతి, మెప్మా పీడీ గీత, మున్సిపల్ చైర్మన్లు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కవిత అరెస్ట్ అప్రజాస్వామికం

అందోల్, మార్చి 15: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కవితను అరెస్ట్ చేశారని వారు ఆరోపించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కవితను అరెస్ట్ చేసి పార్టీశ్రేణులను భయాందోళకు గురిచేసి లబ్ధి పొందాలనే దురుద్దేశంతో బీజేపీ అక్రమ అరెస్టులకు పునుకుటుందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా బీఆర్ఎస్ శ్రేణులు భయపడేది లేదన్నారు. కవిత అరెస్ట్‌కు నిరసనగా శనివారం జోగిపేట హనుమాన్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తామని, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

న్యాల్‌కల్, మార్చి 15: మండలంలోని గుంజోట్టి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.10 లక్షలతో గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు సీసీ రోడ్డు పనులు చేపట్టారు. శుక్రవారం గ్రామంలో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు వారు భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

చౌటకూర్, మార్చి 15: మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గ్రామంలో హనుమాన్ మందిరం వద్ద హైమాస్ట్ లైట్లను గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ శుక్రవారం ప్రారంభించారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీబీపాటిల్ హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బొమ్మరాజు అంజయ్యముదిరాజ్, బుచ్చయ్య, శ్రీనివాస్, రాధయ్య, శివయ్య, సుశీల్, ఆంజనేయులు, రాజు, అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు కక్ష సాధింపు చర్య

నారాయణఖేడ్, మార్చి 15: ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేయడం ముమ్మాటికీ కక్ష సాధింపు చర్య అని నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు బీజేపీ లిక్కర్‌స్కాంను కవితకు ఆపాదించాలని చూస్తున్నదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విచారణ సంస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని తమను ఎదిరించిన వారిపై ఉసిగొల్పుతూ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నదన్నారు. ఢిల్లీ లిక్కర్ వ్యవహారంలో కవిత ప్రమేయమున్నట్లు ఎటువంటి ఆధారాలు లేకపోయినప్పటికీ ఇరికించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఏ నేరం చేయని తెలంగాణ ఆడబిడ్డను ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

లిఫ్ట్‌కు రూ. 4.30కోట్లు

హైదరాబాద్, మార్చి15 (నమస్తే తెలంగాణ): బోరంచ లిఫ్ట్‌కు రూ.4.30కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. నారాయణఖేడ్ నియోజకవర్గం మనూర్ మండలం సింగూరు ఫోర్‌షోర్‌లో ఏర్పాటు చేసిన బోరంచ లిఫ్ట్ స్కీమ్‌కు సంబంధించి చేపట్టనున్న ఫీల్డ్ గ్రావిటీ పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది.

చిత్తశుద్ధితో పనిచేయాలి

ఝరాసంగం, మార్చి 15: అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి మన్ననలు పొందాలని ఎంపీపీ దేవదాస్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలకేంద్రంలోని మేదపల్లి, ఈదులపల్లి, దేవరంపల్లి, కృష్ణాపూర్, ప్యారవరం గ్రామాల్లో ప్రజలకు తీవ్ర తాగునీటి సమస్య ఉందని, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ శంకర్‌పాటిల్, రాజు మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ రాజు మాట్లాడుతూ చెరువుల నుంచి మట్టిని వెంచర్లకు తరలిస్తున్నారని, మాచునూర్ నుంచి బర్దీపూర్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీవో సుధాకర్, వైద్యాధికారిణి రమ్య, ఉపాధ్యక్షుడు మల్లన్నపాటిల్, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు